



కథానిక

వడ్లపట్ల దయానందం

స్థానికంగా అక్కరకొచ్చే సరికొత్త పార్టీనొక దాన్ని మొలిపించడానికి ముకుందం సర్వ విధాలా సర్వప్రయత్నాలూ చురుకుగా కొనసాగిస్తున్న ఉదంతం చూచాయగా అయోమయం చెవుల్లోపడి, రోహిణీకార్తె ఎండలా మండిపడుతున్నాడు.

'ఏమిటో వాడి ఉద్దేశం. ఐదుసంవత్సరాల రాజకీయజీవితం ఉన్న నన్ను సంప్రదించకపోవడం అలా ఉంచి మన బృందంలోకి పరకమంది సభ్యులలో ఏ ఒక్కరితోనైనా కనీసం, చూచాయగా నైనా చెప్పాడా? ఇది వాడి నియంతృత్వపోకడనే వ్యక్తపరుస్తోంది. తక్షణ చర్యలు తీసుకుని, గట్టిగా మందలించక పోతే లాభంలేదు" అన్నాడు అయోమయం.

"ఒరేయ్! ఆడనాన్నా చెప్ప-చెప్పన్నా ఆడు. అంతేగాని చూడు ఆడుతూ చెబుతూ దృష్టంతొక చోటపెట్టి మణాలా అనవసరంగా పెట్టావ్. ఆఖరువరకు ఉంచుకుంటే నీ సొమ్మేంపోయింది. చేతోకులకో లక్షణంగా యాభై ఓటులు కావలసింది. రొండు తగ్గి నల్భైఐదే అయినాయయ్యో. కలుపుచేతికద్దు. తూ-అర్థరూపాయి దండగ వ్చ్" అంటూ అయోమయాన్ని మందలించాడు నిరంజన్.

"ఐతే ఈ వరద దెబ్బతో మన బృంద నిరుద్యోగ సమస్య కొట్టుకుపోతుందన్నమాటే. ప్రస్తుతానికి మూలధన సేకరణకోసం, పరిశోధనలేమైనా సల్పుతున్నాడటనా?" ఒక మూలగా కూర్చుని, చార్టు థియరీలో నిమగ్నుడై, యథాలాపంగా ప్రశ్నించిన పంకజం ప్రశ్నను, లోనికొస్తూనే అందుకుని, ముకుందం సమాధానంగా ధ్వనించడం మొదలు పెట్టాడు.

ఆడుతున్న పేక అట్లానే పారేసి లెంపకాయ తిన్నవాడిలా ముఖం వివిలించుకుని, పొంగుతున్న పాలలా బుస్సున లేవబోయాడు అయోమయం ముకుందంమీదికి. నిరంజన్ వాడి నోరు బలవంతాన మూసి, పైకిలేవకుండా అదిమిపట్టాడు.

ముకుందం చెబుతున్నాడు—

"ఆహా, పరిశోధనలు ఫలించాయి. మన ఆశలు చిగురించాయి. ఇక జన్మలు సైతం తరించినట్లే ... ఏకాంతంగా పరిశోధనల నిమిత్తం కాఫీకి గాని సిగరెట్లకిగాని, వెచ్చించిన, విత్తం, మొత్తానికి ఫలితం దక్కింది. మూడున్నరవందల మూలధనానికి నలుగురి వాగ్దానాల్ని రాబట్టగలిగాను. నలుగురూ, రాబోయే మునిసిపల్ లున్ని కల్లో నాలుగు వార్డుల్లో నిలవడానికి ఉత్సాహపడుతున్నారు. వాళ్ళనే శాశ్వతసంఘపోషకులుగా చేసుకోవడానికి అవకాశాలు, అన్నివైపులా బాగా అవుపిస్తున్నాయ్" చెబుతూనే అకస్మాత్తుగా ముఖాన్ని క్వొశ్చన్ మార్కులమార్చి క్రొత్త వ్యక్తిపై తీక్షణదృక్కులను సారిస్తూ "ఆ క్రొత్త ముఖం ఎవరి తాలూకుది" అనుమానంగా అడిగాడు ముకుందం.

"పరుసకి మాబావమరిది అవుతాడులే. 'ఇంటర్'తో నాల్గుసంవత్సరాలు, తీవ్రంగా పోరాడి చివరకు గ్రూపును

గెంతలేక, అప్రయత్నం విరమించి, ఉద్యోగాన్వేషణలో మనదగ్గరకొచ్చాడు" సమాధానం చెప్పాడు 'పంకజం' బావమరిదివైపు సిగరెట్ కోసం ఒక చెయ్యిపారేసి.

"అయితే. కాఫీ కార్యక్రమం ముగించావన్న మాటే" నవ్వుతూ అన్నాడు నిరంజన్.

లోకంతో సంబంధం లేనట్లుగా కిటికీలో కూర్చు, ఉదయభానుని, కుంకుమరంగు కిరణాలను, ఆదేపనిగా పరిశీస్తున్న 'తారకం' తృళ్ళిపడ్డట్టు అందరి మొఖాలవంక చూచి ముకుందంమీద దృష్టినిలిపి "మరి పెట్టబోయే పార్టీకి, ఆశయాలు సిద్ధాంతాలు నిబంధనలు కార్యక్రమం వగైరా, వ్యవహారాలన్నీ సమకూడినయ్యా" ప్రశ్నించాడు.

"వాటితో అంతగా పనిలేదు నామకార్థం ఏదో సమకూర్చుకుంటే సరిపోతుందిలే ప్రారంభోత్సవానికి, కావలసిన తక్షణసామగ్రి ఇదిగో లిస్టు వ్రాసుకొచ్చాను. విని సలహాలవసరముకుంటే ఇవ్వండి" అంటూ లిస్టొకటితీసి చదవ నుపక్రమించాడు ముకుందం.

1. బుర్రకథ దళం. 2. చిన్న నాటిక ట్రూపు. 3. అధమపక్షం అరవరకమంది వాలంటీర్లు.

4. కనీసం నాలుగు ముక్కలైనా స్టేజీమీద మాట్లాడగలిగిన అధ్యక్షుడొకడు.

5. అనర్గళంగా ఉపన్యసించగలిగిన ఉపన్యాసకుడొకడు—అంటూ కాగితం మడతపెట్టి జేబులో పెట్టుకుంటూ మీ ఉద్దేశాలేమిటి అన్నట్టు అందరి వంకా చూచాడు ముకుందం.

"కాలేజీ డిబేట్సులో రెండుసార్లు ప్రథమ బహుమతి అందుకున్నాను. రెండు గంటల ఉపన్యాస సారాంశాలైనా బట్టీ పట్టి నట్టులేకుండా పబ్లిక్ స్టేజీమీద ఏకరువు పెట్టగలను. అంగీకారమైతే ఏదో అయిటం సమకూడినట్లుగా భావించుకోండి" టైపుమిషనులా, టక, టక, అనేశాడు అయోమయం బావమరిదిగాచెప్పబడ్డ క్రొత్తవ్యక్తి.

"భేష్ క్రొత్తవాడైనా, మెరికలాంటి వాడివి" సర్టిఫైచేశాడు ముకుందం.

"సభ్యత్వపు రుసుము సభ్యత్వ నిబంధనలైనా వస్తుతానికి విధిగాఉండాలిగా అసలు నీ ఉద్దేశమేమిటో చివరికంటూ చెప్పేయ్" తిరిగి హెచ్చరించాడు 'తారకం'—

సాఫీగా హుందాగా ప్రియురాలి మెప్పులను పొందిన ప్రేమికునిలా అధిక మెజారిటీతో గెలుపొందిన ప్రజాప్రతినిధిలా ఎవరెస్టు విజేతలా సర్వవిధాలా విజయగర్వాన్ని ముఖంలోను, తదితర శరీరావయవాలలోను, ఉట్టిపడేస్తూ నోరు తెరచాడు ముకుందం.

"ప్రస్తుతం అమల్లోఉన్న అన్ని రాజకీయ పార్టీలతోను విసుకుచెందిన ప్రజానీకం, విశేషంగా మన పార్టీలో చేరుతుందనటంలో అతిశయోక్తి లేదు. మెంబరుషిప్పుకాని, సిద్ధాంతాలుకాని ఆచరణ కానిలేని రాష్ట్రవ్యాపితమైన పార్టీలకొన్నిటిని మనం ముఖ్యంగా గమనించవలసిన అవసరం ప్రస్తుతానికి కెంతయినా ఉంది. అయినా మనం, మన పట్టణానికి సంబంధించిన ప్రయోజనాలు సాధించేందుకే నడుంకట్టామన్న విషయాన్ని విస్మరించరాదు. కాలం ఖర్మం కలిసివస్తే, తాలూకా మొత్తానికి పరిమితి పెంపొందించి పంచాయితీల్లోకి సైతం ప్రాకించడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు ఇక మెంబరుషిప్పు విషయం—

"మనిషిగా గుర్తించబడ్డ ఎవరైనా, యథేచ్ఛగా చేరనూవచ్చు, వెనువెంటనే పోనూవచ్చు. ఐతే దీనిలో చేరబోయే ముందు, వారి వారి పాత పార్టీల మెంబరుషిప్పును విధిగా రద్దుచేసుకుని, ఈ తాజా సభ్యత్వాన్ని స్వీకరించాలి."

"అలా ఐతే ఇదిగో ఇప్పుడే నా పార్టీకి రాజీనామిచ్చి, దీనిలో సభ్యునిగా చేరుతున్నా స్థానికసేవకి, ఇదివరకే నడుంకట్టి ఉన్న సంగతి అందరికీ విదితమేగదా కాని ఒక్కషరతు అధమపక్షం, కార్యవర్గ సభ్యత్వాన్నైనా ఇస్తేనేగాని" అంటూ నసుగుతూ ఆగాడు అయోమయం.

"అట్టి హామీలను ముందుగానే కోరటంఅన్నది, క్షమించరాని అపచారం" ఉరిమాడు ముకుందం.

"నిజమే ఆ వ్యవహారాలన్నీ మనం, మరోసారి ప్రత్యేకంగా కూర్చొని చర్చించుకుందాం. ఇదిగో మేంకూడా మా మా పాతపార్టీలకు, రాజీనామాలిచ్చి, దీనిలో తాత్కాలిక సభ్యత్వం స్వీక

రిస్తున్నాం. ఇదే మా శపథం." అన్ని కంఠాలూ ఏకగ్రీవంగా అరచినై.

ఉబ్బి తబ్బిబ్బై పోయాడు 'ముకుందం.'

"అవును నాకు తెలుసు ఏది ఎలాఉన్నా రాబోయే మునిసిపల్, ఎన్నికల్లో ఎలాగో ఓటా-నాల్లోట్లు సంపాదించి స్థానిక పరిపాలనా సంస్థలో స్థానాన్ని పొందటమన్నదే మనధ్యేయం. ప్రస్తుతం మన పురంలోని అన్ని వార్డులలోకి ఎలా దూసుకు పోవడం అన్నదే సమస్య. నాకు తోచినంతవరకు నేను చెబుతాను శేషం, సభ్యులకు విడిచి పెడుతాను.

"ఫిరంగిలదిబ్బ" మీద ఉత్పత్తయ్యే అమోనియా కాపుసారా, పరిశ్రమకి, రక్షణ కల్పించడం ద్వారా ఆవార్డు సీటు మనకి సాలిడ్ చేసుకోవచ్చు. అక్కడినుంచి, ట్యూబులద్వారా వివిధ వార్డులలోకి, ఎగుమతయే-హోల్ సేల్ బిజినెస్‌కు ఎట్టి ఆటంకాలు కలుగకుండా, అధికారులతో లోపాయికారీ ఒడంబడికలద్వారా సరిదిద్దటంవల్ల, అన్ని వార్డులలోనూ కొంత వోట్లు సంపాదించవచ్చు... అయితే తరువాత పురాన్నంతనీ కాస్త నిశితంగా పరిశీలిస్తే ప్రయివేటు సంసారాల బాపతు అన్ని పర్వతాలు, దినదినం, అక్కడక్కడా బ్రద్దలవుతూనే వుంటవి. అభిమానమన్నదాన్ని ఆవలకి నెట్టి, చొరబడి కల్పించుకు తీర్పులిస్తూ మధ్యవర్తిత్వం నెరపడంద్వారా కొంతబలాన్ని సమకూర్చుకొనవచ్చు. ఇక కిళ్ళీకొట్లముందుకాని, కాఫీ హోటల్సులో కాని, సినిమాహాల్సు దగ్గరకాని, నిత్యం అవిరామంగా కొనసాగిపోతూండే అన్ని రకాల గుద్దులాటలలోను పార్టీపాత్ర విధిగా ఉండి తీరాలి. బహుశా ఈ విధానాలన్నీ పాతపార్టీలకు సంబంధించిన మీకు కొత్తకాదనుకుంటాను. ఇతర విషయాలు ఏమైనా ఉంటే అభిప్రాయించండి" అంటూ ఆగాడు ముకుందం.

మా వార్డులో ఒకప్రత్యేక పరిస్థితేర్పడ్డది. పరిశీలించండి అంటూ నిరంజన్ మొదలుపెటాడు.

"మా వార్డు మొత్తం ఓట్లు తొమ్మిదివందలు. అందులో ఆరువందలు లేబరు తాలుకువి, మూడు వందలు మిడిల్ క్లాస్‌వి. లేబర్‌లో పలుకుబడికలిగిన బ్రాకెట్ బుక్కర్ వెంకయ్యాని ఫలహారం సంతృప్తిగా పెట్టని కారణంగా, రక్షణశాఖవారు అరెస్టు చేశారు. రికమండేషన్ ఏదైనా పారించి విడిపించామా అంటే - వెంకయ్యా ఇక మనవాడవుతాడు. ఆ సీటిక మనకి గ్యారంటీ అవుతుంది... ఇప్పటికే అన్ని పార్టీలవారు తంటాలు పడుతున్నారు. సాధ్యమయితే మనం తక్షణచర్యలు తీసుకోవాలి."

"బాగుంది, చక్కనిసమస్య. మిగిలిన సభ్యులు కూడా వారివారి వార్డులలో సమస్యలని రాత్రికి వెదకి, తిరిగి రేపుదయానికి నివేదిస్తారని ఆశిస్తున్నా" నన్నాడు ముకుందం.

"మరొక చిన్న సమస్య" అంటూ పంకజం.

"పదమూడవ వార్డు పరిస్థితి ఒక ప్రైవేటు సంసారానికి సంబంధించిన, సమస్యపై, వార్డు మొత్తంరెండు గ్రూపులైయింది. ప్రస్తుతంఆమలులో ఉన్న పార్టీల అంతస్తును మించిపోవడంవల్ల పార్టీల వారిచే పరిష్కరించబడలేక, పోలీస్ స్టేషన్‌ని శరణు జొచ్చిందొక పార్టీ.

ఒకేఒక యువతికూడా వారితోపాటు హాజరయింది. యువతి రూపాన్నిచూస్తే, ఈసమస్య ఇంతపెద్దది కావడంలో ఆశ్చర్యమేమీ లేదనిపిస్తుంది. ఇంతవరకు ఇరుపక్షీయులమధ్య అరడజను కొట్లాటలవరకూ జరిగినవట అన్ని రాజకీయ పక్షాలవారు, ఉభయులమధ్య రాజీ కుదర్చడానికి, తీవ్రకృషి సల్పి, విఫలులైనారని వినికిడి. దీనిలో ధైర్యంగా చొరబడి, పరిష్కరించగలిగితిమా ఆ ఒక్క వార్డులోనేకాక, దాని కిరుప్రక్కలాఉన్న వార్డులలోకూడా, చక్కని కేడరును, కూడకట్టుకోవచ్చు" ఏమంటారన్నట్టు ముఖంపెట్టి ఆగాడు పంకజం.

"ఇవన్నీ అలా అట్టేపెట్టండి, ఇంతకీ మనపార్టీ ప్రారంభోత్సవం, ఎప్పుడు ఎక్కడ?" అమోమయం ప్రశ్న.

"పేరయ్య కోనేటి పార్కులో సాధ్యమైనంత త్వరలోనే ప్రారంభోత్సవాన్ని జరుపుకుందాం ప్రముఖ నటిని పట్టితెద్దాం. తర్వాత కార్యక్రమం అటుపై నిర్ణయించుకుందాం" ముకుందం సమాధానం.

"అబ్బ! తొమ్మిదిన్నరా" ఆవలించాడు నిరంజన్.

అయితే ఆలస్యమెందుకు లెండి కాఫీకన్నదొకకంఠం.